ఈ రోజు జరిగిన సిపిఐ(ఎం) – సిపిఐ ప్రెస్‌మీట్ నోట్‌ను ప్రచురణార్ధం పంపుతున్నాము
– జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి.

తేది : 07 మార్చి, 2023

## ఉద్యోగులను మోసం చేసిన వైసిపికి ఓటు అడిగే అర్హత లేదు
## ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి రాజీనామా చేయాలి
## సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణ

ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసిన వైసిపికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత లేదని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల తొమ్మిది నుండి జరగనున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు ఎమ్మెల్యేలు, ఎంపిలు విచ్చలవిడగా అక్రమాలు, అన్యాయాలకు పాల్పడుతున్నారని, వీటిపై ఎన్నికల సంఘానికి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, జగన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుస్తున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఆరునెలల్లో సిపిఎస్ రద్దుచేస్తానని జగన్ చెప్పారని, ఇప్పుడు మాట తప్పి జిపిఎస్ అంటున్నారని విమర్శించారు. ఒక్కసారి కూడా డిఎస్‌సి పెట్టలేదని, 1998 బ్యాచ్ సమస్య కూడా పరిష్కారం కాలేదని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా, మభ్యపెట్టి, మైమరపించి మోసం చేస్తున్నారని అన్నారు. మాట తప్పం, మడమ తిప్పమని చెప్పి మాట తప్పారని, మడమ తిప్పారని విమర్శించారు.

గుంటూరు, కృష్ణా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పోటీ చేసే సమయంలో గెలిస్తే ఆరునెలల్లో యునిఫైడ్ సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరిస్తామని లేదంటే రాజీనామా చేస్తానని 2021 మార్చిలో చెప్పారని, రెండు సంవత్సరాలు గడిచినా ఒక్క సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ అని ప్రమాణం చేసి రెండేళ్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే రాజీనామా చేస్తానని చెప్పారని, కానీ చేయలేదని అన్నారు. మొత్తం ఏడు వాగ్దానాలను కల్పలతారెడ్డి అమలు చేయలేదని తెలిపారు. మాట తప్పిన కల్పలతారెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో మోసం చేశామని అంగీకరించాలని తెలిపారు. ఇలాంటి వారు వైసిపి అభ్యర్థుల తరుపున ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

నెల్లూరు నుండి వైసిపి అభ్యర్థిగా ఉన్న శ్యాంసుందరరెడ్డిపై దొంగ సారా కేసు ఉందని, సారా అక్రమ రవాణా, దొంగ లేబుల్స్ వ్యాపారంలో ఉన్నందున కేసులు ఎదుర్కొంటున్నానని స్వయంగా అఫిడవిట్ దాఖలు చేశారంటూ దాన్ని మీడియాకు ప్రదర్శించారు. ఇలాంటి మాఫియాలు పెద్దల సభకు ప్రతినిధిగా ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారని, ఏం ముఖం పెట్టుకుని వస్తారని ప్రశ్నించారు. అడిగేందుకు ఆయనకు సంస్కారం లేకపోయినా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉందని వారు కీలెరిగి వాత పెడతారని హెచ్చరించారు. ఒక్క సమస్యనైనా పరిష్కరించలేని వైసిపికి ఓటు వేయడం తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి భంగకరమని తెలిపారు. ఉపాధ్యాయులను గౌరవించే సంస్కృతి వైసిపికి లేదన్నారు.

రకరకాల యాప్‌ల పేరుతో టీచర్లపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచుతున్నారని, దీనివల్ల వారు ఒత్తిడికి లోనై చనిపోతున్నారని తెలిపారు. బాపట్ల జిల్లాలో జరిగిన తాజా ఘటన ప్రస్తావించారు. కరోనా కాలంలోనూ 35 మంది టీచర్లు ప్రాణాలు వదిలారని తెలిపారు. ఈ కాలంలో ఒత్తిడికి లోనై 5గురు టీచర్లు బలయ్యారని చెప్పారు. బైజూస్‌కు సేవ చేయకపోతే విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ రంగంలోకి దిగుతారని, ఉపాధ్యాయులను నోటీసుల రూపంలో వేధిస్తూ, హింసిస్తున్నారని

అన్నారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్ డబ్బు 3 వేలకోట్లను వాడుకునేందుకూ ఉద్యోగులకు అవకాశం లేకుండా చేశారని, ప్రభుత్వమే వాడుకుందని వివరించారు. జీతాలూ సకాలంలో ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రైవేటు స్కూల్ టీచర్లకైతే అసలు భద్రతే లేదని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై మార్చి 9, 10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా మండల కేంద్రాల్లో ధర్నాలు చేస్తున్నామని వివరించారు. అలాగే ప్రైవేటు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ చట్టం తేవాలని కోరారు. చిన్న స్కూళ్లపై వేధింపులు ఆపాలని డిమాండు చేశారు. గ్లోబల్ సమ్మిట్ పెట్టి పెట్టుబడిదారులకు రాయితీల వర్షం కురిపించారని, అదే పాలకులు చిన్న స్కూళ్లను వేధించి డబ్బులు పిండుతున్నారని చెప్పారు.

**వైసిపికి ఓటు – ఉద్యోగులకు చేటు : రామకృష్ణ**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ట్రేడ్ యూనియన్లు కీలకంగా వ్యవహరించే శాసనమండలి ఎన్నికల్లో అధికార వైసిపి నేరుగా జోక్యం చేసుకుని గెలవాలని కిందిస్థాయి ప్రజాప్రతినిధులకు సిఎం స్థాయిలో ఆదేశాలు జారీచేయడం సరైంది కాదని అన్నారు. గతంలో చంద్రబాబుగానీ, వైఎస్ఆర్‌గానీ శాసనమండలి ఎన్నికల్లో నేరుగా జోక్యం చేసుకోలేదని, జగన్ జోక్యం చేసుకోవడంతోపాటు గెలవాలని ఆదేశాలు జారీచేస్తున్నారని మండిపడ్డారు. ఓటుకు మూడువేలా, ఐదువేలా, పదివేలా ఎంత పంచాలనే అంశంపై చర్చలు జరుపుతున్నారని, విద్యావంతుల నియోజకవర్గాల్లోనూ ఇలా డబ్బులు పంచి గెలవాలనుకోవడం అవివేకమని తెలిపారు. అలాగే రాయలసీమలో ప్రతాపరెడ్డి, ఉత్తరాంధ్రలో ఆంధ్రా యూనివర్శిటీ విసి నేరుగా రాజకీయ నాయకులతో కూర్చుని వైసిపిని గెలిపించాల్సిందేనని ఆదేశిస్తున్నారని వారిపై తీవ్ర చర్యలకు తీసుకోవాలన్నారు. దీనిపై వామపక్ష కార్యకర్తలు పట్టుకుంటే ప్రసాదరెడ్డి బాత్‌రూములో దాక్కున్నాడని ఇంత కంటే సిగ్గుచేటు మరొకటి లేదని వివరించారు. మద్యం, ఇసుకలో వందలకోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతున్నాయని, అవన్నీ ఇప్పుడు ఓట్ల కొనుగోలుకు వాడుతున్నారని తెలిపారు. శాసనమండలిలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రశ్నించే పిడిఎఫ్ సభ్యులు లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే జగన్ ఇటువంటి చర్యలకు దిగారని విమర్శించారు. వైసిపి సర్పంచుల మీదే ఆ పార్టీ వారికి నమ్మకం లేదని ఎద్దేవా చేశారు. గుంటూరు డిఇఓ నేరుగా ఉపాధ్యాయులపై బెదిరింపులకు దిగుతున్నారని అన్నారు. రాయలసీమ వెస్ట్‌లో 150 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు, రాష్ట్రానికి, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉపయోగపడని వైసిపి, బిజెపి అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించాలని కోరారు.